క్లుప్తంగా

కాలువ పూడికతీతకు అవాంతరాలు



టీపీ స్కీమ్ కాలువలో పొక్లెయిన్‌తో చేస్తున్న పూడికతీత

సీతానగరం: మండలంలోని పురుషోత్తపట్నంలో ఉన్న తొర్రిగెడ్డ పంపింగ్ స్కీమ్ కుడి కాలువ పూడికతీత పనులకు సీతానగరంలో పలు అవాంతరాలు ఏర్పడుతున్నాయని టీపీ స్కీమ్ చినకొండేపూడి నీటి సంఘం అధ్యక్షుడు కోనే శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం సీతానగరం ఏటిగట్టును ఆనుకుని ఉన్న తొర్రిగెడ్డ పంపింగ్ స్కీమ్ కాలువ పూడికతీత పనులకు పొక్లెయిన్ కాలువలోకి దిగడానికి మార్గం లేకుండా పోయింది. ఏటిగట్టును ఆనుకుని టీపీ స్కీమ్ కాలువ ఇరువైపులా కొన్నేళ్లుగా ఆక్రమించుకుని, ఇళ్లు నిర్మించుకున్నారు. దీనిపై శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ, కాలువ ఇరువైపులా ఆక్రమణల వల్ల పొక్లెయిన్ దిగడానికి అవకాశం లేదన్నారు. స్థానికులు కాలువ దాటడానికి సిమెంట్ స్తంభాలు అడ్డుగా వేశారని, ఇళ్లకు విద్యుత్ సర్వీసుల వైర్లు, పంచాయతీ అందించే తాగునీటి పైపు లైన్లు అడ్డుగా ఉన్నాయని చెప్పారు. వీటిని మినహాయించి, మిగిలిన కాలువ పూడికతీత పనులు నిర్వహిస్తున్నట్టు వివరించారు. ఏటా నీటి విడుదల సమయంలో ఇక్కడి నివాసాలు ముంపునకు గురవుతున్నాయని చెప్పారు.

విద్యాసంస్థలకు నోటీసులు

కోరుకొండ: రోడ్డు భద్రత నియమాలను పాటించాలని విద్యాసంస్థల బస్సు డ్రైవర్లు, యాజమాన్యానికి నోటీసులు అందజేసినట్టు కోరుకొండ ఎస్సై కూన నాగరాజు తెలిపారు. డ్రైవర్లకు లైసెన్స్‌లు, విద్యాసంస్థల బస్సులకు ఫిట్‌నెస్ ఉండాలన్నారు. బస్సులకు సీబుక్, ఆర్‌సీ బుక్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పొల్యూషన్ సర్టిఫికెట్లు ఉండాలన్నారు. ప్రతి బస్సుకు క్లీనర్లు తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. బస్సులు బయలుదేరే ముందు వాహనాలను పూర్తిగా పరిశీలించాలని, బస్సులోని పిల్లలు సురక్షితంగా ఉన్నారనేది గమనించాలని స్పష్టం చేశారు. డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్‌లో మాట్లాడరాదని చెప్పారు. రెడ్ సిగ్నల్ వద్ద ఆపకపోవడం నేరమన్నారు. ఆయా భద్రతా నియమాలను నోటీసులో పేర్కొన్నట్టు తెలిపారు. వీటిని అనుసరించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్టు చెప్పారు.

ఆదిత్యునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో సూర్యదేవుడు, దేవేరులు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవుని సన్నిధిలో ఆదివారం స్వామివారికి పంచామృతాభిషేకాలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు వ్రత పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్న సమారాధనను ఆలయ కమిటీ వారు ఏర్పాటు చేశారు.

నేడు సర్టిఫికెట్ల పరిశీలన

రాజమహేంద్రవరం రూరల్: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకాని అభ్యర్థులకు అవకాశం కల్పించినట్టు ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు తెలిపారు. బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం ధ్రువీకరణ పత్రం అందజేస్తారన్నారు. అలాగే 90,001 ర్యాంకు నుంచి చివరి ర్యాంకు వరకు అభ్యర్థులు పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలకు ఆప్షన్లు ఎంపిక చేసుకోవచ్చని తెలిపారు.

ఫ్లై ఓవర్‌పై ఇసుక ఇక్కట్లు



మోరంపూడి ఫ్లై ఓవర్‌పై ఇసుక

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి ఫ్లై ఓవర్‌పై ఇసుక ఇక్కట్లు తప్పడం లేదు. ధవళేశ్వరం గాయత్రి ర్యాంపు నుంచి ఇసుక లారీలు నిబంధనలు పాటించకుండా రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో బొమ్మూరు నుంచి లాలాచెరువు వైపు వెళ్లే లారీల నుంచి ఇసుక జాతీయ రహదారిపై, మోరంపూడి ఫ్లై ఓవర్‌పై పడుతుంది. దీనివలన వాహనచోదకులు జారిపడి, గాయాల పాలవుతున్నారు. ఇప్పటికైనా రవాణా, పోలీసు, రెవెన్యూ అధికారులు ఇసుక లారీలపై కొరడా ఝుళిపించాలని వాహనచోదకులు కోరుతున్నారు.

వయ్యారి భామ.. నీ హింస చాలిక

- రోగాలను అందించే మహమ్మారి
- పంటలపై తీవ్ర దుష్ప్రభావం
- నిర్మూలన ఒక్కటే పరిష్కారం



జితేంద్రనాథ్



వయ్యారి భామ (పార్థీనియం) మొక్క



రాజానగరం: చూడటానికి ఎంతో ముచ్చటగా ఉంటుంది ఈ మొక్క. పేరు కూడా దానికి తగ్గట్టుగానే ఉంటుంది. ముట్టుకుంటే.. చర్మ రోగాలను పంచుతుంది. అదేంటనుకుంటున్నారా..! ఎక్కడపడితే అక్కడ ఖాళీ ప్రదేశాల్లో దర్శనమిచ్చే వయ్యారి భామ అనే మొక్క అది. ఖాళీ ఉంటే చాలు ఏపుగా పెరిగి, అందమైన పూలతో కనిపించే ఈ మొక్క వర్షాకాలంలో ఇది మరింతగా విస్తరిస్తుంది. చూడటానికి అందంగా కనిపించే ఈ మొక్కలను వదిలేస్తే ఎన్నో సమస్యలు వస్తాయంటున్నారు కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) సేద్యపు పంటల రిటైర్డ్ అధికారి జితేంద్రనాథ్.

ప్రపంచంలో మొండి జాతికి చెందిన పది రకాల కలుపు మొక్కల్లో పార్థీనియం ఒకటి. ఇది అమెరికాకు చెందిన కలుపు మొక్క. సుమారు 70 ఏళ్ల క్రితం గోధుమ విత్తనాల దిగుమతి ద్వారా భారతదేశంలోకి ప్రవేశించింది. దీనిని ఇక్కడ వయ్యారి భామ, మాచర్ల కంప, ముక్కు పుడకగా పిలుస్తుంటారు. ఉత్తర భారతదేశంలో క్యారెట్ గ్రాస్, కాంగ్రెస్ వీడ్ అని కూడా పిలుస్తారు. ఈ కలుపు మొక్క కారణంగా వ్యవసాయంలో 40 శాతం వరకు పంట నష్టం వాటిల్లుతోంది.

లక్షణాలు

పార్థీనియం మొక్క రెండు మీటర్ల ఎత్తు వరకు ఎదుగుతుంది. దీని ఆకులు చీలికలతో కూడి సన్నటి నూగులాంటి రోమాల మాదిరిగా శాఖోపశాఖలుగా కొమ్మలతో ఏపుగా పెరుగుతుంది. ఇది మొలకెత్తిన నాలుగు నుంచి ఆరు వారాల్లోగానే పూత దశకు వస్తుంది. ఒక్కో మొక్క 10 వేల నుంచి 25 వేల వరకు విత్తనాలను ఉత్పత్తి చేస్తుంది. వీటి విత్తనాల పైభాగం జుత్తు కలిగి ఉండడం వల్ల గాలి, నీరు, పశువులు, మనుషులు, వ్యవసాయ పనిముట్ల ద్వారా సులువుగా వ్యాపిస్తాయి. ఈ మొక్కలోని అన్ని భాగాల్లో (కాండం, ఆకులు, కొమ్మలపై నూగు, పుప్పొడి) పార్థీనిస్ అనే విష పదార్థం ఉంటుంది. దీనివల్ల మానవాళికి, పశువులకు వివిధ రకాల జబ్బులు సంభవిస్తాయి. ముఖ్యంగా పొలాలు, బంజరు భూములు, అటవీ ప్రాంతాలు, రహదార్ల పక్కన, పార్కులు, రైల్వే లైన్ల వెంబడి ఇవి విస్తరిస్తాయి. చూడటానికి అందంగా ఉండడం వల్ల వీటిని నాశనం చేయాలనే ఆలోచన ఎవరికీ రాదు.

దుష్ప్రభావాలు అధికం

- వయ్యారి భామగా పేర్కొనే ఈ పార్థీనియం మొక్కల పుప్పొడి వల్ల మనుషుల్లో శ్వాసకోశ సంబంధ వ్యాధులు (ఆస్తమా), చర్మ వ్యాధులు, విష జ్వరాలు వస్తాయి.
- పశువులకు కూడా ఊపిరితిత్తుల వ్యాధులు, జ్వరాలు, చర్మ వ్యాధులు సోకుతాయి.
- పాడి పశువులు ఈ మొక్కలను ఆహారంగా తీసుకున్నప్పుడు చర్మ సంబంధ వ్యాధులు కలగడమే కాకుండా, పాల ఉత్పత్తి తగ్గి, పశువుల బరువు కూడా తగ్గిపోతూ ఉంటుంది.

పంటలకు, మొక్కలకు నష్టం

- పార్థీనియం మొక్కలు ఒక రకమైన రసాయనాన్ని వేర్ల ద్వారా స్రవించి, ఇతర మొక్కలను మొలకెత్తకుండా నిరోధిస్తాయి. ఇవి ఉన్న ప్రాంతంలో వేరొక మొక్కలు బతకవు.
- పచ్చిక మైదానాల్లో గడ్డి రాకుండా, ఎదగకుండా చేస్తుంది. ఈ కారణంగా పశుగ్రాసం కొరతకు కారణమవుతాయి.
- ఈ మొక్కలకు త్వరగా పెరిగే గుణం ఉండటం వల్ల వేరుతో పెకలించకుండా వీటిని కోస్తే మరలా త్వరగా పెరిగే శక్తి ఉంటుంది.
- పొలాల్లో విపరీతంగా వ్యాపించి, పంటలను ఎదగకుండా చేయడంతో దిగుబడులు గణనీయంగా పడిపోతాయి.
- ఈ మొక్కల పుప్పొడి వల్ల టమాటా, వంగ, చిక్కుడు వంటి కూరగాయల మొక్కలు, పాదులు పూత రాలిపోయి, కాయ ఏర్పడకుండా నిరోధిస్తుంది.
- వివిధ పంటలకు సోకే పిండి నల్లికి ఈ పార్థీనియం మొక్కలు నివాసాలుగా ఉపయోగపడతాయి.

సమగ్ర నివారణ పద్ధతులు

- పార్థీనియం మొక్కలను నివారించడంలో గ్రామాల్లోని రైతులంతా తమ పొలాల్లో సామూహికంగా చర్యలు చేపట్టాలి. పూత రాకముందే ఈ మొక్కలను వేర్లతో పీకి, తగులబెట్టాలి. ఆపై ఎక్కడైనా మొక్కలు మొలిస్తే వెంటనే వాటిని కూడా వేర్లతో సహా పెకలించాలి. ఈ విధంగా నాలుగైదు ఏళ్లు చేస్తేనే వీటిని పూర్తిగా నివారించవచ్చు.
- వేసవిలో పొలాలను లోతుగా దుక్కి చేయడం వల్ల కలుపు విత్తనాలు కూడా లోతుకు పోయి మొలకెత్తవు. తద్వారా పార్థీనియం ఉత్పత్తి తగ్గుతుంది.
- నీటి ఉధృతి ఎక్కువగా ఉన్న పొలాల్లో బంతి పంట మార్పిడి సాగు ద్వారా కూడా కలుపును నివారించవచ్చు.
- జై గో గ్రామా, బై కొలరేటా అనే కీటకాలు ఈ మొక్కల ఆకుల, కాండాన్ని తినడం ద్వారా సమర్థవంతంగా నివారించవచ్చు. పొలంలో ఈ మొక్కల తీవ్రతను అనుసరించి 500 నుంచి వెయ్యి వరకు పైన పేర్కొన్న కీటకాలను వదలడం ద్వారా వాటి సంతతి కూడా వృద్ధి చెందుతూ, పెద్ద, చిన్న కీటకాలు ఈ మొక్కలను సమగ్రంగా ఆరగిస్తాయి.
- పైరు సాగు చేయని పొలాల్లో ఉప్పు ద్రావణాన్ని 15 లేదా 20 శాతం (లీటరు నీటిని 150 లేదా 200 గ్రా.) పూతకు రాకముందే పిచికారీ చేయాలి. వేసవిలో ఎకరాకు గ్లైఫోసేట్ ఒకటి లేదా 1.5 లీటర్లు పూత దశకు రాకముందే కలుపు మొక్కలపై పిచికారీ చేయడం ద్వారా కూడా వీటి ఉధృతిని తగ్గించవచ్చు.

నాలుగు టన్నుల కూరగాయల అందజేత



వాడపల్లికి వ్యాన్‌లో కూరగాయలు తరలిస్తున్న సూరిబాబు తదితరులు

సీతానగరం: మండలంలోని చినకొండేపూడికి చెందిన వాకపల్లి సూరిబాబు ఆధ్వర్యంలో వాడపల్లి ఏడు వారాల వేంకటేశ్వర స్వామివారి దేవస్థానానికి నాలుగు టన్నుల కూరగాయలు అందజేశారు. దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి స్థానికుల సహకారంతో వీటిని ఆదివారం చినకొండేపూడి నుంచి వ్యాన్‌లో వాడపల్లికి తరలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, పాతికేళ్లుగా వివిధ దేవస్థానాలకు కూరగాయలు, బియ్యం, గోశాలకు ఎండుగడ్డిని అందిస్తున్నట్టు చెప్పారు. తిరుమల తిరుపతి, అంతర్వేది దేవస్థానాలకు నిత్యాన్నదానానికి బియ్యం, కూరగాయలు, నిత్యావసరాలను పలుమార్లు అందించామన్నారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు, మాజీ వైస్ ఎంపీపీ కోసూరి త్రిమూర్తులరాజు, సింగవరం సర్పంచ్ సంగన చినపోశియ్య తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మంటపానికి విరాళం

కోరుకొండ: మండలంలోని శ్రీరంగపట్నం గౌరీశంకరుల కల్యాణ మంటపానికి బీజేపీ నేత, విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు ఆదివారం రూ.1.50 లక్షల విరాళం అందించారు. రూ.ఐదు లక్షలు విరాళం అందిస్తానని ఆలయ కమిటీకి ఇటీవల హామీ ఇచ్చారు. తొలి విడతగా రూ.1.50 లక్షలకు చెక్కును అందజేశారు.

జూలై 22న ఏఐఎఫ్‌డీయూ మహాసభ



కాపవరంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

బిక్కవోలు: ఏఐఎఫ్‌డీయూ (అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య) ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా మహాసభ వచ్చే నెల 22వ తేదీన పిఠాపురంలో జరుగుతుందని సమాఖ్య జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు తెలిపారు. ఈ మహాసభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఆదివారం మండలంలోని కాపవరం గ్రామంలోని మహాసభ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మికోద్యమ చరిత్రలో అఖిల భారత కార్మిక సంఘాల ఆవిర్భావం 1991లో జరిగిందన్నారు. నాటి నుంచి నేటి వరకు దేశవ్యాప్తంగా సంఘటిత, అసంఘటిత రంగాల్లో కార్మికులను ఐక్యం చేస్తూ, కార్మికుల సమస్యలపై వీరోచితంగా పోరాడుతుందన్నారు. జిల్లాలో భవన నిర్మాణ కార్మికులు, క్వారీ, సామిల్లు, పారిశుధ్య, ఇంటి పనివారు, మోటార్ తదితర రంగాల కార్మికులతో యూనియన్ల నిర్మాణాల్లో ఏఐఎఫ్‌డీయూ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మడికి సత్యం, జట్టు లోవరాజు, కొల్లు రాంబాబు, బత్తిన సుబ్బారావు, కర్రి భారతమ్మ, డోకుబుర్ర మరియమ్మ, దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి ఘన సత్కారం



వీరరాఘవరెడ్డి దంపతులను సత్కరిస్తున్న కొంకుదురు పీవీ తదితరులు

బిక్కవోలు: మండలంలోని పందలపాక మెయిన్ స్కూల్ ఉపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన కర్రి వీరరాఘవరెడ్డి, సుజాత దంపతులను ఆదివారం సత్కరించారు. బలభద్రపురం గ్రామంలోని ఆంధ్రా షిర్డీసాయి మందిర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలోని ఉపాధ్యాయులు, నాయకులు, కుటుంబ సభ్యులు వారిని సత్కరించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ జిల్లా నాయకుడు, కొంకుదురు ఎంపీటీసీ కొంకుదురు పీవీ మాట్లాడుతూ, కొంకుదురు గ్రామానికి చెందిన వీరరాఘవరెడ్డి ఎంతో మంది విద్యాభివృద్ధికి కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీబాలత్రిపుర సుందరి సమేత త్రిముఖ లింగేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ పడాల వెంకటరామారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చింతా శ్రీనువాసరెడ్డి, ఉపాధ్యాయులు జంగా శ్రీనువాస్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అశాస్త్రీయ భావజాలంతో సమాజానికి చేటు

కంబాలచెరువు: సైన్స్ ఫలితాలు సామాన్యుల వద్దకు చేరకపోవడానికి సమాజంలో రాజ్యమేలుతున్న అశాస్త్రీయ భావజాలమే కారణమని పలువురు వక్తలు అన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం స్థానిక దానవాయిపేటలోని ప్రదీప్ డయాబెటిస్ ఆసుపత్రి వద్ద జరిగింది. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక సభ్యత్వ క్యాంపెయిన్ పోస్టర్‌ను జిల్లా నాయకులు ఎస్.రవిబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక గత 38 ఏళ్లుగా తెలుగు ప్రజలతో స్నేహ సంబంధాలు కొనసాగిస్తూ, ప్రజలు శాస్త్రీయంగా ఆలోచించాలని, మానవత్వంతో జీవించాలని ఆకాంక్షిస్తూ శాస్త్ర ప్రచారంతో ప్రజలను చైతన్యవంతం చేస్తోందన్నారు. విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచడానికి ఉచిత వేసవి శిక్షణ శిబిరాలు, చెకుముకి సైన్స్ పరీక్షలు, సెమినార్లు నిర్వహిస్తుందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కె.భీమయ్య మాట్లాడుతూ సైన్స్ ఇప్పటికీ పాఠ్య గ్రంథాల్లో ఉంది మినహా జీవన విధానంగా మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ డాక్టర్ సూర్యనారాయణరెడ్డి



పార్టీ కార్యాలయంలో వీరభద్రరావును సత్కరిస్తున్న డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగ కమిటీ సభ్యులుగా ఇటీవల నియమితులైన పెదపూడి మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన సీనియర్ నేత నాగుమళ్ల వీరభద్రరావు(రావు) ఆదివారం మాజీ ఎమ్మెల్యే, పార్టీ అనపర్తి నియోజకవర్గ కో–ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని స్థానిక పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తమపై నమ్మకంతో పార్టీలో కీలకమైన బాధ్యతను అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం డాక్టర్ సూర్యనారాయణరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వీరభద్రరావును డాక్టర్ సూర్యనారాయణరెడ్డి దుశ్శాలువాతో సత్కరించారు. అనంతరం డాక్టర్ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, పెదపూడి మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ, పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు కేతా శ్రీనివాస్, నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు సొంబత్తుల చంటి, పెదపూడి మండల వైస్ ఎంపీపీ కరెడ్ల వెంకన్నబాబు, ఎంపీటీసీ ద్వారంపూడి వెంకటరెడ్డి, వీరెడ్డి, రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి మండ రాజారెడ్డి, రాష్ట్ర యువజన కేంద్ర కమిటీ కన్వీనర్ విజయ్‌రెడ్డి, కర్రి శ్రీవెంకటరెడ్డి, నియోజకవర్గ, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షులు కొటికలపూడి చినబాబు, కోసూరి వాసు, మామిడాడ ఉపసర్పంచ్ తాతారెడ్డి, రాయుడు రాఘవ, నాయకులు కొంగర వాసు, సుందరపల్లి వీరభద్రం, డోకుబుర్ర కృష్ణ, కోసూరి సూరిబాబు, కట్టా రమణ, అశోక్, ఇమ్మంది దుర్గాప్రసాద్, నల్లా సూరిబాబు, గంగుమళ్ల సుబ్రహ్మణ్యం, కొటికలపూడి శ్రీను, రాజుపాలెం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలువురికి పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

మండలంలోని పలు కుటుంబాలను డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆదివారం పరామర్శించారు. పొలమూరుకు చెందిన గుబ్బల వీర్రాజు భార్య లక్ష్మి, అలాగే నల్లమిల్లి ఆదిలక్ష్మి ఇటీవల మరణించారు. వారి కుటుంబ సభ్యులను డాక్టర్ సూర్యనారాయణరెడ్డి పరామర్శించారు. అలాగే కొప్పవరం గ్రామానికి చెందిన మంగిరెడ్డి, అనపర్తి కొత్తూరు గ్రామానికి చెందిన వోగిరెడ్డి రామారెడ్డి ఇటీవల మరణించారు. వారి కుటుంబాలనూ ఆయన పరామర్శించారు. ఆయన వెంట నాయకులు తాడి తాతారెడ్డి, కర్రి వెంకటకృష్ణారెడ్డి, సత్తి సత్యనారాయణరెడ్డి, నల్లమిల్లి ఆదిరెడ్డి, వార్డు మెంబర్ సత్తి శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ తాడి సూరారెడ్డి, పడాల వెంకటరెడ్డి, సత్తి గంగిరెడ్డి, వోగిరెడ్డి కృష్ణారెడ్డి, నల్లమిల్లి సాయిరామారెడ్డి, వోగిరెడ్డి ఈశ్వరరెడ్డి, వోగిరెడ్డి వెంకట మణిదీప్ రెడ్డి, సత్తి వెంకటరెడ్డి, సత్తి ఈశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

గుండెపోటుతో ఈఈ శ్రీధర్‌వర్మ కన్నుమూత



దాట్ల శ్రీధర్‌వర్మ (ఫైల్)



శ్రీధర్‌వర్మ భౌతికకాయం వద్ద కుటుంబ సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: ఏపీఈపీడీసీఎల్ (ఆపరేషన్స్) రాజమహేంద్రవరం రూరల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్‌వర్మ(60) శనివారం అర్ధరాత్రి గుండెపోటుతో కన్నుమూశారు. మూడు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. శనివారం అర్ధరాత్రి గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలారు. ఆయనకు భార్య కనకదుర్గ, తల్లిదండ్రులు, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ ఏడాది డిసెంబర్‌లో ఆయన ఉద్యోగ విరమణ చేయనున్నారు. విధి నిర్వహణలో శ్రీధర్‌వర్మ అంకితభావంతో పనిచేయడంతో పాటు, చిన్న, పెద్ద అని తేడాలేకుండా చిరునవ్వుతో ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించేవారని ఉద్యోగులు భావోద్వేగానికి గురయ్యారు. బొమ్మూరు గ్రామంలో సంతాన సీతారామాలయం నిర్మాణంలో శ్రీధరవర్మ కీలకపాత్ర పోషించారు. విద్యుత్ శాఖ ఓసీ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షునిగా శ్రీధర్‌వర్మ సేవలందిస్తున్నారు.

భౌతికకాయానికి పలువురి నివాళి


రాజమహేంద్రవరం వేంకటేశ్వరనగర్‌లోని శ్రీధర్‌వర్మ నివాసంలో ఆయన భౌతికకాయాన్ని పలువురు అధికారులు సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సీపీడీసీఎల్ (ప్రాజెక్ట్స్ అండ్ హెచ్‌ఆర్) డైరెక్టర్ టీవీఎస్ఎన్ మూర్తి, తూర్పుగోదావరి, కోనసీమ, విశాఖ ఎస్ఈలు తిలక్‌కుమార్, రాజబాబు, శ్యాంబాబు, విశ్రాంత సీజీఎం వైఎస్ఎన్ ప్రసాద్, విశ్రాంత ఎస్ఈ చింతా సత్యనారాయణరెడ్డి, రాజమండ్రి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్, విద్యుత్ ఉద్యోగులు ఓసీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, డీఈలు, ఏడీఈలు, ఏఈలు, ఉద్యోగులు శ్రీధర్‌వర్మకు నివాళులర్పించారు. అనంతరం శ్రీధర్‌వర్మ అంత్యక్రియలను కోటిలింగాలరేవులోని శ్మశానవాటికలో నిర్వహించారు.

వర్షంతో నారుమడులకు జీవం



రంగంపేట: మెట్ట ప్రాంత మండలమైన రంగంపేటలో ఇటీవల కురుసిన వర్షాలకు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వరి నారుమడులకు నీరు లేక ఇబ్బందులు పడుతున్న రైతులు.. అల్పపీడనం కారణంగా అడపాదడపా కురుస్తున్న వర్షానికి ఆకుమడుల్లో నీరు చేరడంతో జీవం వచ్చింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. ఆదివారం కూడా చిరుజల్లులు పడ్డాయి. వ్యవసాయ పనులకు ఈ వానలు మేలు చేయడంతో ఇప్పటి వరకు నారుమడులు వేయనివారు అందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే వేసిన ఆకుమడులకు ఈ వర్షం ఎంతో ఉపయోగం కానుంది. ముఖ్యంగా ఖరీఫ్ పనులకు ఈ వర్షాలు మేలు చేస్తున్నాయి.

మోడుతో పొంచి ఉన్న ముప్పు



బిక్కవోలు రెవెన్యూ కార్యాలయం వద్ద ఉన్న మోడు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు తహసీల్దార్ కార్యాలయం వద్ద చెట్టు మోడు ఉంది. చెట్టు నరికి మోడు వదిలివేయడంతో అది కానరావడం లేదు. కార్యాలయానికి, పక్కనున్న ఆధార్ కేంద్రానికి నిత్యం ప్రజలు వస్తుంటారు. దీంతో చాలామంది ఈ మోడును తన్నుకుని కిందపడుతున్నారు. దీని పక్కన కరెంట్ స్తంభం కూడా ఉంది. ఒకవేళ ఎవరైనా మోడును తన్నుకుని, కరెంట్‌స్తంభంపై పడితే ప్రాణాపాయం సంభవించే అవకాశం లేకపోలేదు. మోడును పూర్తి స్థాయిలో తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆకాశ దీపిక



ఏ చిత్రకారుడి కుంచె నుంచి జాలువారిన పెయింటింగ్ కాదిది. ఆకాశమే కాన్వాస్‌గా ప్రకృతి గీసిన చిత్రమిది. తూర్పున ఉదయించే భానుడు ఎంతో ప్రశాంతంగా దర్శనమిస్తాడు. అదే పడమర వైపు అస్తమించే సమయంలో ఆకాశాన ఎర్రటి కాంతులతో ప్రజ్వరిల్లుతాడు. రాజానగరం–అనపర్తి రోడ్డులో ఆదివారం సాయంత్రం పసుపు, ఎరుపు వర్ణాలతో శోభాయమానంగా దర్శనమిచ్చిన ఈ దృశ్యం చూపరులను ఆకట్టుకుంది. – రాజానగరం